సాక్షి
అనంతపురం

శనివారం । 2 । డిసెంబర్ । 2023



నేత్రపర్వంగా గౌరమ్మ వేడుకలు
హావళిగిలో కడ్లే గౌరమ్మ పూల రథోత్సవం నేత్రపర్వంగా సాగింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తరించారు.
8లో



టమాట కిలో రూ.22
కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.22 పలికింది. కనిష్టం రూ.10, సరాసరి రూ.14 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం 33.2°/ 19.4°
జిల్లా అంతటా శుక్రవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. ఉదయం చలి కొనసాగింది.

న్యూస్‌రీల్

జిల్లాకు వర్షసూచన



అనంతపురం అగ్రికల్చర్: అల్పపీడనం ప్రభావంతో రాగల మూడు రోజులు జిల్లాలో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.అశోక్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వాయువ్యం దిశగా గాలులు గంటకు 8 నుంచి 20 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉన్నందున రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రధానంగా వరి కోతలు, పంట ఉత్పత్తుల సురక్షిత నిల్వకు చర్యలు చేపట్టాలని తెలిపారు. అరటి, టమాట లాంటి పంటలు దెబ్బతినకుండా కట్టెలతో ఊతం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

సెంట్రల్ వర్సిటీలో సంస్కృత విద్య శిక్షణ కేంద్రం



అభ్యసన సామగ్రిని ప్రదర్శిస్తున్న ప్రొఫెసర్లు

అనంతపురం: సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీలో కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం వారి అనౌపచారిక సంస్కృత విద్య శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ముఖ్య అతిథి ఎస్వీ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ వీవీఎస్ రాజేంద్ర ప్రసాద్ సంస్కృత భాషలో ఉన్న వేదాంత శాస్త్రం, రాజనీతి శాస్త్రం, ఆర్థిక శాస్త్రం ప్రత్యేకతను విశదీకరించారు. ప్రొఫెసర్ విశాల్ ప్రసాద్ భట్, సంస్కృత భారతి ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు జే.కుమార్ చంద్రశేఖర్ తదితరులు అనౌపచారిక అధ్యయన కేంద్రం గురించి తెలియజేశారు.

రేపు కోటి దీపోత్సవం



ఆత్మకూరు: పంపనూరు సర్వరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో కార్తీకమాస ఉత్సవాల్లో భాగంగా ఆదివారం కోటి దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ అక్కిరెడ్డి తెలిపారు. ఆ రోజు ఉదయాన్నే దామోదర కల్యాణోత్సవం, పంచామృతాభిషేకాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం కోటి దీపోత్సవం ఉంటుందన్నారు.

అన్నదాతకు సర్కారు అండ

రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తోంది. రైతు భరోసా కేంద్రాల (ఆర్బీకే) ద్వారా వ్యవసాయ సేవలను రైతు చెంతకే తెచ్చింది. ఉన్న ఊరిలోనే సబ్సిడీ విత్తనాలు, ఎరువులు అందిస్తోంది. పంట ఉత్పత్తులకు కనీస మద్దతు ధర ప్రకటించి అండగా నిలుస్తోంది. మార్కెట్లో తక్కువ ధర ఉన్నపుడు రైతులు కనీస మద్దతు ధరతో ప్రభుత్వానికి పంట ఉత్పత్తులు విక్రయించవచ్చు.




- వేరుశనగకు మద్దతు ధర క్వింటా రూ.6,377
- వరి రూ.2,203, కంది రూ.7 వేలు, పత్తికి రూ.7,020
- ఎంఎస్‌పీ కన్నా మార్కెట్‌లో ధర తక్కువైతే కొనుగోళ్లు
- ఇప్పటికే పత్తి, చిరుధాన్యాల కొనుగోళ్లకు ఏర్పాట్లు

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్–2023లో వర్షాభావ పరిస్థితుల నడుమ అంతో ఇంతో పంట ఉత్పత్తులు చేతికి వచ్చాయి. ఆ పంటను అమ్ముకునేందుకు రైతులు ఇబ్బంది పడకుండా సీజన్ ప్రారంభానికి మునుపే రాష్ట్ర ప్రభుత్వం కనీస మద్దతు ధర (మినిమం సపోర్ట్ ప్రైసెస్–ఎంఎస్‌పీ) ప్రకటించింది. ఎంఎస్‌పీ కన్నా మార్కెట్‌లో ధర తక్కువగా ఉంటే ఎట్టి పరిస్థితుల్లోనూ అమ్ముకోవద్దని జిల్లా అధికారులు రైతులకు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరతో కొనుగోలు చేస్తామంటున్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ద్వారా తాడిపత్రి, గుత్తి మార్కెట్‌యార్డుల్లో పత్తి కొనుగోళ్లకు ఏర్పాట్లు చేశారు. మొక్కజొన్న కొనుగోలుకు మార్క్‌ఫెడ్ సిద్ధవుతోంది. చిరుధాన్యాల కొనుగోలుకు పౌరసరఫరాలశాఖ సిద్ధంగా ఉంది. ఈ పరిస్థితుల్లో ఏ పంటకు మద్దతు ధర ఎంతనేది రైతులు తెలుసుకుని, అంతకన్నా తక్కువగా ఉంటే బహిరంగ మార్కెట్‌లో అమ్ముకోవద్దని అధికారులు చెబుతున్నారు.

ఎంఎస్‌పీ ఇలా...

ఈసారి ఖరీఫ్ పంట ఉత్పత్తులకు సంబంధించి 15 పంటలకు ఎంఎస్‌పీ ప్రకటించారు. అందులో ఉమ్మడి జిల్లాకు సంబంధించి ప్రధానంగా వేరుశనగ, కందులు, మొక్కజొన్న, పత్తి లాంటి ముఖ్యమైన పంటలు ఉన్నాయి. వేరుశనగ గతేడాది కన్నా క్వింటాలుపై రూ.527 పెంచి రూ.6,377గా నిర్ణయించారు. అలాగే గతేడాది కన్నా పత్తికి రూ.540, కందులకు రూ.400, మొక్కజొన్నకు రూ.128, వరిధాన్యంపై రూ.143, నువ్వులపై రూ.805, పెసలుపై రూ.803 ప్రకారం పెంచారు. సజ్జలు, రాగులు, జొన్నల మీద కూడా రూ.150 నుంచి రూ.250 వరకు పెంచారు. ప్రస్తుతం ఎంఎస్‌పీ కన్నా మార్కెట్‌లో కొంత వరకు ధరలు అధికంగానే ఉన్నట్లు చెబుతున్నారు. ఏది ఏమైనా మద్దతు ధర కన్నా తక్కువగా ఉంటే మాత్రం బయట మార్కెట్‌లో అమ్ముకోవద్దని వ్యవసాయ శాఖ, పౌరసరఫరాలశాఖ, మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ అధికారులు సూచిస్తున్నారు.



మొక్కజొన్న



పత్తి

ఖరీఫ్ పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)

పంట	క్వింటా ధర (రూపాయల్లో)
వరి (సాధారణం)	2,180
వరి (ఎ-గ్రేడు)	2,203
వేరుశనగ	6,377
కందులు	7 వేలు
పత్తి (మీడియం)	6,620
పత్తి (పొడవు రకం)	7,020
మొక్కజొన్న	2,090
జొన్న (మాల్దండి)	3,225
జొన్న (హైబ్రిడ్)	3,180
సజ్జలు	2,500
రాగులు	3,846
పెసలు	8,558
మినుములు	6,950
నువ్వులు	8,635
నైగర్‌సీడ్ (ఒడిసెలు)	7,734
సోయాబీన్	4,600
పొద్దుతిరుగుడు	6,760

జిల్లాలో 2,213 పోలింగ్ కేంద్రాలు

- ఎన్నికల కమిషన్ ఆమోద ముద్ర

జిల్లాలో పోలింగ్ కేంద్రాల వివరాలు

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాల సంఖ్య
రాయదుర్గం	296
ఉరవకొండ	259
గుంతకల్లు	276
తాడిపత్రి	272
శింగనమల	293
అనంతపురం	277
కళ్యాణదుర్గం	261
రాప్తాడు	279
మొత్తం	2,213

అనంతపురం అర్బన్: జిల్లాలో 2024లో జరగనున్న సాధారణ ఎన్నికల నిర్వహణకు 2,213 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణకు సంబంధించి జిల్లా ఎన్నికల యంత్రాంగం పంపిన ప్రతిపాదనలకు ఎన్నికల కమిషన్ ఆమోదముద్ర వేసింది. గత ఎన్నికల సమయంలో జిల్లాలో 2,198 పోలింగ్ కేంద్రాలు ఉండేవి. హేతుబద్ధీకరణ తరువాత రాయదుర్గం నియోజకవర్గంలో కొత్తగా మూడు కేంద్రాలు, తాడిపత్రిలో ఒకటి, శింగనమలలో రెండు, అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో 9 కేంద్రాలు మొత్తం 15 కేంద్రాలు పెరిగాయి.

ప్రదేశం, పేరు మార్పు...

అదే విధంగా 83 చోట్ల పోలింగ్ కేంద్రం ప్రదేశం మార్పు, 116 కేంద్రాలకు ప్రస్తుతం ఉన్న భవనం పేరు మార్పు ప్రతిపాదనలను ఎన్నికల కమిషన్ ఆమోదించింది. ఇందులో రాయదుర్గం నియోజకవర్గంలో 28 కేంద్రాల ప్రదేశం, 11 చోట్ల పేరు మార్పు, ఉరవకొండలో రెండు కేంద్రాల ప్రదేశం మార్పు, గుంతకల్లులో 7 కేంద్రాల ప్రదేశం, 32 కేంద్రాల పేరు మార్పు చేశారు. తాడిపత్రిలో 13 కేంద్రాల ప్రదేశం, 25 చోట్ల పేరు మార్పు, శింగనమలలో 6 కేంద్రాల ప్రదేశం మార్పు, 5 కేంద్రాల పేరు మార్పు, అనంతపురం అర్బన్‌లో 22 కేంద్రాల ప్రదేశం, 13 కేంద్రాల పేరు మార్పు, కళ్యాణదుర్గంలో 13 కేంద్రాల పేరు మార్పు, రాప్తాడు నియోజకవర్గంలో 5 కేంద్రాల ప్రదేశం, 17 కేంద్రాల పేరు మార్పు చేశారు.

నిబంధనల మేరకు క్లెయిముల పరిష్కారం

- క్షేత్రస్థాయిలో విచారణ తర్వాతే ఓట్ల తొలగింపునకు చర్యలు
- సీఈఓకు తెలిపిన కలెక్టర్ గౌతమి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ గౌతమి, జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో భాగంగా నిర్వహించిన ఇంటింటి సర్వేలో అందిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం పరిష్కరిస్తున్నామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) ముఖేష్ కుమార్ మీనాకు కలెక్టర్ గౌతమి వివరించారు. ఓటరు జాబితా సవరణ, క్లెయిమ్‌ల పరిష్కారం తదితర అంశాలపై సీఈఓ శుక్రవారం విజయవాడ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్లెయిమ్‌లు, అభ్యంతరాలపై క్షుణ్ణంగా విచారణ చేసి పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఓట్ల తొలగింపునకు సంబంధించి ఫారం–7 దరఖాస్తుల విషయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నామన్నారు. ప్రతి దరఖాస్తుపై క్షేత్రస్థాయిలో విచారణ చేసిన తరువాతే పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి సెక్టార్ అధికారులు, సెక్టార్ పోలీసు అధికారులను నియమించడంతో పాటు శిక్షణ కూడా ఇచ్చామని చెప్పారు. సీఈఓ మాట్లాడుతూ కొత్త ఓటర్ల నమోదు, ముసాయిదా జాబితాలో చేర్పులు, తొలగింపులకు సంబంధించిన వివరాలను రాజకీయ పార్టీలకు అందజేయాలని ఆదేశించారు. శని, ఆదివారాల్లో ప్రత్యేక శిబిరాలను ప్రతి పోలింగ్ కేంద్రంలో నిర్వహించాలన్నారు. కేంద్రంలో బీఎల్‌ఓలు ఉదయం నుంచి సాయంత్రం వరకు తప్పనిసరిగా ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్‌డీఓలు గ్రంధి వెంకటేష్, శ్రీనివాసులు రెడ్డి, ఈఆర్‌ఓలు సుధారాణి, వెంకటేశ్వర్లు, ఎన్నికల సెల్ తహసీల్దారు భాస్కర్, డీటీ కనకరాజు, ఎస్‌ఏ శామ్యూల్ బెంజిమన్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌డీ అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదల

- ఇండస్ట్రియల్, ఎగ్జిక్యూటివ్ కోటాలో పార్ట్ టైం, ఫుల్ టైం పీహెచ్‌డీ అవకాశం



అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురంలో ఇండస్ట్రియల్, ఎగ్జిక్యూటివ్ కోటాలో పార్ట్‌టైం, ఫుల్‌టైం పీహెచ్‌డీ కోర్సులు అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇండస్ట్రీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో పనిచేసే ఎగ్జిక్యూటివ్, అర్ అండ్ డీ (రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్) సంస్థల్లో పని చేసే శాస్త్రవేత్తలు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, సివిల్ సర్వీసెస్ అధికారులు పీహెచ్‌డీ అడ్మిషన్ పొందవచ్చు. సంబంధిత పీజీలో 55 శాతం మార్కులు లేదా 6.0 సీజీపీఏ సాధించిన వారు అర్హులు. ఇద్దరు గైడ్లు ఉంటారు. పనిచేస్తున్న సంస్థలో ఒక గైడ్, యూనివర్సిటీ తరపున ఒక గైడ్ ఉంటారు. దరఖాస్తులు సివిల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్, ఈసీఈ, కంప్యూటర్ సైన్స్, కెమికల్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమేటిక్స్, మేనేజ్‌మెంట్, బయోటెక్నాలజీ, ఫార్మాసూటికల్ సైన్సెస్, ఇంగ్లిష్, ఫుడ్ టెక్నాలజీ రంగాల్లో పీహెచ్‌డీ చేయడానికి అవకాశం కల్పించారు. జేఎన్‌టీయూ అనంతపురం కానిస్టిట్యూట్ కళాశాలలే కాకుండా యూనివర్సిటీ గుర్తించిన 14 పరిశోధన కేంద్రాల్లో దేనిలోనైనా పీహెచ్‌డీ చేయవచ్చు. అభ్యర్థులు రూ.1500 డిమాండ్ డ్రాఫ్ట్‌తో దరఖాస్తుకు సంబంధిత సర్టిఫికెట్లను జత చేస్తూ ఈ నెల 16వ తేదీలోపు యూనివర్సిటీకి చేరేటట్లు పంపాలి.

రీసెర్చ్ కేంద్రాలు ఇవే..

జేఎన్‌టీయూ అనంతపురం కానిస్టిట్యూట్ కళాశాలల (జేఎన్‌టీయూ అనంతపురం, కలికిరి, పులివెందుల, ఓటీపీఆర్ఐ)తో పాటు 14 పరిశోధన కేంద్రాల్లో అడ్మిషన్లు కల్పిస్తారు. శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాల (నంద్యాల), శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (అటానమస్) (చిత్తూరు), శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ (అటానమస్) తిరుపతి, వేము ఇనిస్టిట్యూట్ (పి.కొత్తకోట, చిత్తూరు), శ్రీనివాస మేనేజ్‌మెంట్ స్టడీస్ (చిత్తూరు), శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఫార్మసీ (చిత్తూరు), కేఎస్ఆర్‌ఎం (అటానమస్) కడప, శ్రీ పద్మావతి స్కూల్ ఆఫ్ ఫార్మసీ (తిరుపతి), అన్నమాచార్య (అటానమస్) రాజంపేట, జి.పుల్లారెడ్డి (అటానమస్) కర్నూలు, ఆర్‌జీఎం (అటానమస్) నంద్యాల, రైపర్ అనంతపురం, సెవన్ హిల్స్ ఫార్మసీ తిరుపతి.

అంతరం తగ్గాలి



రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో శాస్త్రవేత్తలుగా ఉన్న వారు, ఇండస్ట్రీ అనుభవం ఉన్నవారికి పరిశోధన పట్ల ఆసక్తి ఉంటే పీహెచ్‌డీ చేయడానికి అవకాశం కల్పిస్తాం. దీంతో పరిశ్రమ– కళాశాల మధ్య అంతరం తగ్గి.. బంధం బలపడుతుంది. పరిశ్రమలకు తగ్గట్టుగా పరిశోధన చేయడానికి కళాశాల దోహదపడుతుంది. ఇచ్చిపుచ్చుకునే ధోరణితో కళాశాలలో పరిశోధన వాతావరణం మెరుగుపడుతుంది. దీంతో ఇండస్ట్రీలో అనుభవం ఉన్నవారికి అవకాశం కల్పిస్తున్నాం.

– ప్రొఫెసర్ జింకా రంగజనార్దన, వీసీ, జేఎన్‌టీయూ అనంతపురం

ఏపీ హక్కులను కాపాడితే విమర్శలెందుకు?

- ప్రతిపక్షాల తీరుపై ఎమ్మెల్యే అనంత ధ్వజం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత

అనంతపురం కార్పొరేషన్: నాగార్జున సాగర్ ప్రాజెక్టు విషయంలో రాష్ట్ర హక్కులు కాపాడుకుంటే రాష్ట్రంలోని ప్రతిపక్షాలు, ఓ వర్గం మీడియా స్పందిస్తున్న తీరు శోచనీయమని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. శుక్రవారం అనంతపురంలోని హమాలీ కాలనీలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర విభజన చట్టం మేరకు కృష్ణా జలాలను కూడా విభజించినట్లు తెలిపారు. ఇందులో 34 శాతం తెలంగాణ వాటా ఉండగా.. మిగిలిన 66 శాతం ఆంధ్రప్రదేశ్‌దని స్పష్టం చేశారు. ఈ క్రమంలో ఏపీ ప్రయోజనాల దృష్ట్యా మన వాటా కింద ఉన్న 13 గేట్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. గతంలో మాజీ సీఎం చంద్రబాబు అసమర్థత వల్లే నాగార్జున సాగర్‌పై మన హక్కుల్ని కోల్పోయామన్నారు. ఓటుకు నోటు కేసులో చిక్కుకున్న చంద్రబాబు ఏపీ ప్రయోజనాలను తాకట్టుపెట్టి తోక ముడిచారని విమర్శించారు. ఈ మొత్తం వ్యవహారంలో కేంద్రం కూడా సరిగా స్పందించలేదన్నారు. ఈ రోజు ఏపీ హక్కులను కాపాడుకునే ప్రయత్నం చేస్తే విమర్శలు చేయడం తగదన్నారు. ఏపీ ప్రభుత్వ చర్యలకు ప్రతిపక్షాలు మద్దతుగా నిలవకుండా ద్వంద్వ నీతిని ప్రదర్శిస్తున్నాయని విమర్శించారు. తెలుగుదేశం, బీజేపీ, జనసేన, సీపీఐ కేవలం సీఎం జగన్‌ను విమర్శించడమే పనిగా పెట్టుకున్నాయని దుయ్యబట్టారు. నాగార్జున సాగర్ ప్రాజెక్ట్‌పై తమ హక్కులను ప్రజాస్వామ్య పద్ధతిలో కాపాడుకుంటామని స్పష్టం చేశారు.

పయ్యావుల పెద్ద బ్లాక్ మెయిలర్

- దొంగ ఓట్లు కాపాడుకునేందుకు తాపత్రయం
- మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ధ్వజం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ పెద్ద బ్లాక్ మెయిలర్ అని, దొంగ ఓట్లను కాపాడుకునే తాపత్రయంలో అధికారులను బెదిరిస్తున్నాడని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి విమర్శించారు. ఆయన శుక్రవారం అనంతపురంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఉరవకొండలో దొంగ ఓట్లకు సంబంధించి బహిరంగ విచారణకు రావాలని తాము గతంలోనే సూచించినా..పయ్యావుల ఏనాడూ ముందుకు రాలేదన్నారు. ఫారం– 7 దరఖాస్తులపై విచారణ సవ్యంగా లేదంటూ అధికారులపై ఆరోపణలు చేయడం అర్థరహితమన్నారు. వారు తొమ్మిది వేల ఓట్లు, తాము తొమ్మిది వేల ఓట్లకు సంబంధించి ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. అధికారులు పారదర్శకంగా విచారణ చేపట్టేందుకు అభ్యంతరాలున్న వారికి నోటీసులు పంపారన్నారు. ఇటువంటి తరుణంలో ఎమ్మెల్యే ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

ఓటమి భయంతోనే కుయుక్తులు

ఉరవకొండలో టీడీపీ ఓటమి ఖాయమని భావించిన కేశవ్ అందుకు కారణాలు వెతుక్కునే పనిలో పడ్డారని విశ్వేశ్వరరెడ్డి విమర్శించారు. గతంలో వివిధ కారణాలు చూపుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎలాగైతే పలాయనం చిత్తగించారో.. ఇవాళ కూడా అదే రీతిలో దొంగ ఓట్ల అంశాన్ని తెరపైకి తెస్తున్నారని దుయ్యబట్టారు. కేశవ్ నాలుగున్నరేళ్లుగా ప్రజల్లోకి వెళ్లలేదని, సమస్యలను పట్టించుకోలేదని తెలిపారు. ఇప్పుడు ఎన్నికలు దగ్గర పడడంతో దొంగ ఓట్లను కాపాడుకునేందుకు ముందుకొచ్చారని దుయ్యబట్టారు. టీడీపీ, పయ్యావుల బెదిరింపులకు తలొగ్గకుండా ఎన్నికల నిబంధనల మేరకు ముందుకెళ్లాలని కలెక్టర్, అధికారులకు విజ్ఞప్తి చేశారు. అధికారులపై బెదిరింపుల అంశాన్ని ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళతామన్నారు. ఫారం–7కు సంబంధించి ఓటర్ల వివరాలను తాము అధికారులకు అందజేశామన్నారు. టీడీపీ కనీసం ఆ ధైర్యం చేయకపోగా ఎంపీ రఘురామకృష్ణం రాజు ద్వారా అధికారులకు ఫిర్యాదులు చేయించడం శోచనీయమన్నారు. ఉరవకొండ నియోజకవర్గానికి, గోదావరి జిల్లాకు చెందిన రఘురామకు ఏమి సంబంధమని ప్రశ్నించారు. విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు సీపీ వీరన్న, కేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ బాధితులపై వివక్ష తగదు



ర్యాలీ ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం

అనంతపురం మెడికల్: హెచ్ఐవీ బాధితుల పట్ల వివక్ష తగదని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్ దినాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నగరంలో ర్యాలీ నిర్వహించింది. మేయర్ వసీంతో కలిసి జెడ్పీ చైర్‌పర్సన్ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. దాదాపు 2,500 మంది విద్యార్థులతో సాగిన ఈ ర్యాలీ ఆర్ట్స్ కళాశాల నుంచి టవర్‌క్లాక్, సుభాష్ రోడ్డు, సప్తగిరి సర్కిల్ వరకు సాగింది. సప్తగిరి సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి హెచ్ఐవీ నియంత్రణకు పాటుపడుతామని ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ మాట్లాడుతూ జిల్లాలో హెచ్ఐవీ తగ్గుముఖం పడుతోందని ఆరోగ్యశాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయన్నారు. కానీ హెచ్ఐవీతో జీవించే వారు క్రమం తప్పకుండా మందులు తీసుకుని ఆరోగ్యంగా జీవించాలని సూచించారు. మేయర్ వసీం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. డీఎంహెచ్ఓ భ్రమరాంబదేవి మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో హెచ్ఐవీ పరీక్షలు ఉచితంగా చేస్తారని, బాధితులకు ఏఆర్‌టీ సెంటర్లలో మందులు అందజేస్తారని తెలిపారు.

విద్యార్థులకు ప్రశంస

హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు ఆరోగ్యశాఖ గత నెల 20 నుంచి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వక్తృత్వ, వ్యాసరచన, ముగ్గుల పోటీలు నిర్వహించింది. ఆ పోటీల్లో విజేతలుగా నిలిచిన నర్సింగ్, డిగ్రీ, ఫార్మసీ విద్యార్థులకు శుక్రవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో మెమెంటో, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ అనుపమజేమ్స్, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సూపర్‌వైజర్ జీవీ రమణ, ఆర్డీటీ డైరెక్టర్ డాక్టర్ సిరప్ప, డెమో ఉమాపతి, డిప్యూటీ హెచ్ఈఓ గంగాధర్, అనంత నెట్‌వర్క్ ఆఫ్ పాజిటివ్ అధ్యక్షుడు వీరాంజనేయులు పాల్గొన్నారు.

సంతోషమని 'పింఛన్'



గుత్తి మండలం అబ్బేదొడ్డిలో తెల్లవారుజామున వృద్ధుడికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ అన్వేష్

అనంతపురం: జిల్లాలో వైఎస్సార్ పెన్షన్ కానుక కింద డిసెంబర్ నెల సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ శుక్రవారం ప్రారంభించారు. సచివాలయ వలంటీర్లు తెల్లవారుజామునే తలుపు తట్టి పింఛన్ అందివ్వడంతో అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, వివిధ రకాల చేతి వృత్తిదారులు సంతోషం వ్యక్తం చేశారు. జిల్లాలో 2,86,426 మంది లబ్ధిదారులకు గాను తొలి రోజే 2,38,801 మందికి (83 శాతం) పింఛన్ అందజేశారు.

నేత్రపర్వంగా కడ్లే గౌరమ్మ వేడుకలు



హావళిగిలో కడ్లే గౌరమ్మదేవి పూల రథోత్సవ దృశ్యం



హారతులతో ఊరేగుతున్న ఆడపడుచులు

విడపనకల్లు: మండలంలోని హావళిగిలో కడ్లే గౌరమ్మ పూల రథోత్సవం శుక్రవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారు జామున 3 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎడ్లబండిపై గౌరీదేవి ప్రతిమను ఉంచి, వీధుల గుండా మంగళ వాయిద్యాలు, డప్పులతో ఊరేగించారు. మహిళలు, యువతులు గౌరీదేవి పూల రథం ముందు 101 కళశాలతో హారతులు పట్టారు. ఉత్సవాలకు పాల్తూరు, గాజుల మల్లాపురం, ఉండబండ, కరకముక్కల, విడపనకల్లు నుంచే కాకుండా కర్ణాటకలోని రూపనగుడి, శంకరబండ, గణేష్‌నగర్, కమ్మరచేడు, బళ్లారి, ఉరవకొండ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గ్రామం చివరన ఉన్న చెరువులో కడ్లే గౌరమ్మను నిమజ్జనం చేశారు.

క్లుప్తంగా

చెరువులో మునిగి బాలుడి మృతి



జనార్దన్ మృతదేహం

గుత్తి రూరల్: మండలంలోని అబ్బేదొడ్డికి చెందిన గవ్వల జనార్దన్ (6) శుక్రవారం చెరువులో మునిగి మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన మేరకు.. గవ్వల కాశీరావు, పెద్దక్క దంపతుల కుమారుడు జనార్దన్.. గ్రామ శివారులోని చేపల చెరువులో తన పెదనాన్న కిష్టప్ప వల కట్టాడని చూసేందుకు మరో బాలుడితో కలిసి వెళ్లాడు. వారిని చూసిన కిష్టప్ప ఇంటికి పంపాడు. అయితే ఇద్దరు పిల్లలు వేరే దారిలో మళ్లీ చెరువు దగ్గరకు వెళ్లారు. చేపల వల చూస్తూ జనార్దన్ ప్రమాదవశాత్తూ చెరువులో పడి మునిగిపోయాడు. ఈ విషయాన్ని పక్కనే ఉన్న మరో బాలుడు పరుగున గ్రామంలోకి వెళ్లి విషయం తల్లిదండ్రులకు చెప్పాడు. బాలుడి తండ్రి స్థానికులతో కలిసి చెరువు వద్దకు చేరుకుని నీటిలో గాలించారు. నీటిలో చిక్కుకున్న బాలుడిని బయటకు తీసుకొచ్చి, ఆటోలో గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి, అప్పటికే మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. బాలుడి మృతితో తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. బాలుడి తండ్రి ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య



తలారి లింగప్ప (ఫైల్)

గుమ్మఘట్ట : మండలంలోని భూపసముద్రంలోని వేదావతి హగరి సమీపంలో సీమజాలి చెట్టుకు తలారి లింగప్ప (34) ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. లింగప్ప భార్య నాగమణికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. లింగప్ప చింతపండు వ్యాపారం చేస్తూ జీవనం సాగించాడు. గత బుధవారం ఉదయం నుంచి ఇంటి నుంచి వెళ్లిపోయిన లింగప్ప.. రెండురోజులైనా ఇంటికి తిరిగిరాలేదు. శుక్రవారం ఉదయం చెట్టుకు వేలాడుతూ విగతజీవిగా కనిపించడంతో స్థానికులు గమనించి, కుటుంబ సభ్యులకు తెలియజేశాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, పూర్తి వివరాలు సేకరించారు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు.

థ్యాంక్యూ సీఎం సార్



సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలియజేస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి

శింగనమల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. మండలంలోని నాయనవారిపల్లి వద్ద శింగనమల పంప్డ్ స్టోరేజ్ హైడ్రో పవర్ ప్రాజెక్టు ఏర్పాటు కానుంది. దీంతో శుక్రవారం సీఎం క్యాంపు కార్యాలయంలో ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. భారీ ప్రాజెక్టు మంజూరు చేయడంతో తమ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని, అందుకు ఎంతో రుణపడి ఉంటామని సీఎంకు ఆలూరు సాంబశివారెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈవీఎంలపై అవగాహన కల్పించాలి

- అధికారులకు కలెక్టర్ గౌతమి ఆదేశం



అవగాహన కేంద్రం ప్రారంభించి వివరాలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం) వినియోగంపై విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఎం.గౌతమి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందన కౌంటర్ వద్ద ఈవీఎంల వినియోగంపై అవగాహన కేంద్రాన్ని కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎం ద్వారా ఓటు ఎలా వేయాలని అనే అంశంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు చేపట్టిన కార్యక్రమం వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు కొనసాగుతుందన్నారు. ఈవీఎంలు ఎలా పనిచేస్తాయనేది వివరిస్తారన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈవీఎంలను కలెక్టరేట్, అనంతపురం, గుంతకల్లు, కళ్యాణదుర్గం ఆర్డీఓ కార్యాలయాలతో పాటు నియోజకవర్గ కేంద్రాల్లోని తాలుకా కార్యాలయాల్లో అవగాహన కేందాలను ఏర్పాటు చేశామన్నారు. ఈవీఎంల వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని ఓటు వేసే విధానం తెలుసుకోవాలని ప్రజలకు కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, ఆర్డీఓలు గ్రంధి వెంకటేష్, సి.శ్రీనివాసులురెడ్డి, ఈఆర్‌ఓలు సుధారాణి, వెంకటేశ్వర్లు, ఎన్నికల సెల్ తహసీల్దారు భాస్కర్, స్పందన తహసీల్దారు మారుతి, డీటీ కనకరాజు, ఎస్‌ఏ శామ్యూల్ బెంజిమన్ పాల్గొన్నారు.

భద్రత చర్యలు వేగవంతం చేయాలి

- డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్



గుంతకల్లు: మిచాంగ్ సైక్లోనిక్ తుఫాన్ ప్రభావం దృష్ట్యా రైలు కార్యకలాపాలకు భద్రత కల్పించేందుకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని జోనల్ అధికారులు ఆదేశించినట్లు డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. డివిజన్ పరిధిలో తుఫాన్ పరిస్థితిలను ఎదుర్కొనేందుకు అన్ని విధాలుగా సిద్ధంగా ఉండాలని సూచించారు. అందుకు అవసరమైన సామగ్రి అందుబాటు ఉంచుకోవడంతోపాటు రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో కలిసి సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. తుఫాను గమనాన్ని ఎప్పుటికప్పుడు గమనిస్తూ అందుకు తగ్గ చర్యలకు సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. దీనికి అదనంగా ఇబ్బందికరమైన బ్రిడ్జిల వద్ద వాచ్‌మన్ల నియమించాలని, నిలిచిపోయిన వరద నీటిని పంపింగ్ చేయడానికి డీజిల్ పంపులను ముందుగానే ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. తుఫాను పరిస్థితులతో ఏపీ, తమిళనాడులోని దక్షిణ కోస్తా ప్రాంతాల్లో భారీ వర్షాల కారణంగా రైలు సర్వీసులు రాకపోకలు విషయంలో మార్పు వచ్చే అవకాశం ఉందన్నారు. వాటి పరిస్థితికనుగుణంగా దారి మళ్లించడం, రీ షెడ్యూలు చేయడం, లేదా పాక్షికంగా రద్దు చేయనున్నట్లు తెలిపారు. రైలు ప్రయాణికులు తమ రైలు ప్రయాణాలను అందుకనుగుణంగా ప్లాన్ చేసుకోవాలని తెలియజేశారు. వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాడానికి సమీపంలోని రైల్వే స్టేషన్లలోని అధికారులను సంప్రదించాలని సూచించారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

- జిల్లా విద్యాశాఖ అధికారి నాగరాజు



మాట్లాడుతున్న డీఈఓ నాగరాజు

అనంతపురం ఎడ్యుకేషన్: ఈనెల 3న నిర్వహించనున్న నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష కోసం జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి నాగరాజు తెలిపారు. స్థానిక పాత డీఈఓ కార్యాలయంలో భద్రపరిచిన ప్రశ్నపత్రాలను పరీక్ష కేంద్రాలకు సమీపంలోని పోలీస్‌స్టేషన్లకు సీఎస్, డీఓల ద్వారా శుక్రవారం తరలించారు. పరీక్ష రోజు ఆయా పోలీస్‌స్టేషన్ల నుంచి తెచ్చుకోవాలని డీఈఓ సూచించారు. ఈ సందర్భంగా చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులతో డీఈఓ సమావేశం ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 13 సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరుగుతుందన్నారు. మొత్తం 2,886 మంది ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు హాజరవుతున్నారన్నారు. విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. ఈ పరీక్షలో ప్రతిభ కనబరిస్తే నాలుగేళ్లపాటు ఉపకార వేతనం రూ.48 వేలు మంజూరవుతుందన్నారు. హాల్ టికెట్లను ఆయా స్కూల్స్ హెచ్‌ఎంలు డౌన్‌లోడ్ చేసి, విద్యార్థులకు అందించాలన్నారు. సమావేశంలో ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందనాయక్, డీసీఈబీ కార్యదర్శి పురుషోత్తం బాబు పాల్గొన్నారు.

కృత్రిమ అవయవాలకు నమోదు చేసుకోండి

అనంతపురం కల్చరల్: భారత వికాస పరిషత్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు, చేతులు అందిస్తున్నట్లు నిర్వాహకులు పరుచూరు రమేష్ ఓ ప్రకటనలో తెలిపారు. దురదృష్టవశాత్తూ ప్రమాదాల్లో అవయవాలు పోగొట్టుకున్నవారికి నాణ్యమైన కృత్రిమ కాళ్లు, కాలిఫర్స్ ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 9లోపు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు శ్రీనివాస క్లాత్‌స్టోర్స్, రఘువీర టవర్స్ పక్కన, సుభాష్‌రోడ్డు, అనంతపురం చిరునామాలో సంప్రదించాలన్నారు. వివరాలకు సెల్: 9849508904, 9492583346 నంబర్లలో సంప్రదించాలన్నారు.

భక్తిశ్రద్ధలతో దీపారాధనోత్సవాలు



అలంకరణలో స్వామి సమాధి

బొమ్మనహాళ్: దర్గాహొన్నూరు శర్మాస్ హుసేనీస్వామి ఉరుసులో భాగంగా రెండో దీపారాధనోత్సవాలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. దర్గాకు చేరుకొని దీపారాధన చేసి, చక్కెర చదివింపులు చేశారు. నిర్వాహకులు భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేశారు. శనివారం ఉరుసే షరీఫ్ సవారి జరుగుతుంది.

జనవాక్కు

పదేళ్ల కల సాకారం



మాకు పదేళ్లుగా సొంతిల్లు లేదు. కూలీ పనులు చేసుకుంటూ అద్దె ఇంట్లో నివసిస్తున్నాం. గతంలో తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి అర్జీలు ఇచ్చి సమస్యను చెప్పుకున్నాం. అధికారులుగానీ ప్రజాప్రతినిధులుగానీ ఎవరూ మా గురించి పట్టించుకోలేదు. జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత మా గ్రామ వలంటీర్ మా ఇంటి వద్దకు వచ్చి మీకు ఇంటి స్థలంతోపాటు ఇల్లు కూడా మంజూరవుతుందని చెప్పాడు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా సమస్య తీరలేదు.అడగకుండానే మా సమస్యను గుర్తించి ఇంటి స్థలంతోపాటు, ఇల్లు నిర్మించి ఇచ్చారు. ఇప్పుడు చాలా సంతోషంగా ఉంది. జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రిగా కొనసాగితేనే మాలాంటి వారి సమస్యలు తీరుతాయి.
– గీతమ్మ, తెనగల్లు, కుందుర్పి మండలం

ఎవరి సిఫార్సులేకుండా సేవలు



మా గ్రామం ఎల్లుట్ల నుంచి మండల కేంద్రానికి వెళ్లాలంటే దాదాపు 27 కిలో మీటర్ల దూరం. గతంలో ప్రతి చిన్న పనికీ మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మా గ్రామంలోనే సచివాలయం ఏర్పాటు చేసింది. అందులో అన్ని శాఖలకు సంబంధించి ఉద్యోగులు అందుబాటులో ఉంటున్నారు. దీంతో మండల కేంద్రానికి వెళ్లాల్సిన పని లేకుండా గ్రామంలోనే అన్ని పనులు చేస్తున్నారు. ఈ ప్రభుత్వంలో పింఛన్ కానుకతో పాటు వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ రైతు భరోసా, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సున్నా వడ్డీ పథకాల ద్వారా నా కుటుంబానికి రూ.1.70 లక్షల లబ్ధి చేకూరింది. గతంలో ఏ ప్రభుత్వంలోనూ ఇంత లబ్ధి పొందలేదు. అర్హత ఉంటే చాలా ఎవరి సిఫార్సు లేకుండా పథకాలు వర్తిస్తున్నాయి.
– సుంకర గళ్ల గంగమ్మ, ఎల్లుట్ల గ్రామం, పుట్లూరు మండలం

జీవితాలు మెరుగుపడ్డాయి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నవరత్నాల్లో భాగంగా అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొంది, జీవితాలు మెరుగుపరుచుకున్నాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక విడతలవారీగా అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన కింద రూ.2.23 లక్షలు, వసతి దీవెన కింద రూ. 30 వేలు, వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.18 వేలు లబ్ధి పొందాం. తలదాచుకోను గూడులేని మాకు జగనన్న కాలనీలో ఇంటి స్థలం మంజూరు చేసి, ఇల్లు మంజూరు చేశారు. పేదల మేలు కోరే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పదికాలాల పాటు కొనసాగాలి.
– సి.నాగలక్ష్మి, కల్లూరు, లేపాక్షి మండలం

జగనన్న రుణం తీర్చుకోలేనిది



మాది మధ్య తరగతి కుటుంబం. వెంకటేశ్వర మహిళా స్వయం సహాయక సంఘం సభ్యురాలిని. వైఎస్ జగన్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత విడతల వారీగా డ్వాక్రా రుణాలు మాఫీ అవుతోంది. దీంతో మళ్లీ కొత్తగా సంఘంలో మరింత రుణం తీసుకొని, పాడి ఆవు కొనుగోలు చేశా. పాడి ద్వారా వచ్చే ఆదాయం కుటుంబ జీవనానికి సరిపోగా,.. జగనన్న విద్యాదీవెన ద్వారా వచ్చే నగదు పిల్లలు చదువుకు ఉపయోగపడుతోంది. దీంతో పిల్లలు ఇద్దరూ చిన్నపాటి ఉద్యోగాలు చేస్తూ కుటుంబ పోషణకు చేదోడుగా ఉంటున్నారు. జగనన్న గత ఎన్నికలప్పుడు ఇచ్చిన మాట మేరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో అందించడంతో పిల్లల చదువుకు ఉపయోగపడింది. జగనన్న రుణం ఎప్పటికీ మరిచిపోలేం.
– రత్నమ్మ, వెంకటేశ్వర మహిళా సంఘం సభ్యురాలు, మరువకొత్తపల్లి, చిలమత్తూరు మండలం.

ఏడుగురు జూదరుల అరెస్ట్

తాడిపత్రి: మండలంలోని చిన్నపొడమల గ్రామ శివారులో పేకాటాడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు రూరల్ ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ శుక్రవారం తెలిపారు. వారి నుంచి రూ. 1,05,350 నగదు, 4 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

పోలీసులపై దాడి కేసులో 9 మందికి జైలు

అనంతపురం క్రైం: పోలీసులపై దాడి చేసిన తొమ్మిది మందికి రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ అనంతపురం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి దీన తీర్పు వెలువరించారు. వివరాలు.. అనంతపురం రూరల్ మండలం పూలకుంటలో జరిగిన చోరీ కేసులో ఓబులేసు అనే వ్యక్తి ప్రధాన నిందితుడు. 2016 జూనల్ 17న బళ్లారి జిల్లా కౌలు బజారు పోలీసు స్టేషన్‌కు చెందిన ఏఎస్‌ఐ జటింగప్పతో పాటు మరికొంత మంది పోలీసులు గ్రామానికి వెళ్లారు. బ్రూస్ పేట చోరీ కేసులో నిందితుడిగా ఉన్న ఓబులేసును అదుపులోకి తీసుకుంటుండగా ఓబులేసు కుటుంబ సభ్యులు కర్ణాటక పోలీసులపై రాళ్లు, కట్టెలతో దాడి చేసి, తీవ్రంగా గాయపరిచారు. ఈ దాడిలో కర్ణాటక పోలీసు బృందంలోని వన్నూరప్ప, వీరేష్‌లకు బలమైన గాయాలయ్యాయి. మిగిలిన వారికి స్వల్పగాయాలయ్యాయి. పోలీసు వాహనాన్ని రాళ్లు, కట్టెలతో ధ్వంసం చేశారు. ఈసమయంలో పోలీసుల సీడీఫైల్‌ను అపహరించారు. మరోసారి ఈ గ్రామంలోకి అడుగుపెడితో చంపుతామని బెదిరించారు. ఈ దాడిలో గాయపడిన వన్నూరప్ప, వీరేష్‌లను తోటి పోలీసు సిబ్బంది ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఏఎస్‌ఐ జట్టింగప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పట్లో ఇటుకలపల్లి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. అనంతపురం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి దీన ప్రధాన నిందితుడు ఎం.ఓబులేసుతో కలిపి దాడికి తెగబడిన తొమ్మిది మందికి రెండేళ్ల జైలు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. అప్పటి దర్యాప్తు అధికారి అబ్దుల్ ఖరీమ్, ఏపీపీ వెంకటరమణారెడ్డి, కానిస్టేబుల్ చంద్రమౌళిలను జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ అభినందించారు.

'ఆపస్' జిల్లా మహిళా కన్వీనర్‌గా మంజుశ్రీ



అనంతపురం ఎడ్యుకేషన్: ఆంధ్ర ప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) మహిళా విభాగం జిల్లా కన్వీనర్‌గా విడపనకల్లు మండలం హావలిగి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని బి. మంజుశ్రీని ఎన్నుకున్నారు. రాష్ట్రశాఖ సూచనల మేరకు మంజుశ్రీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆపస్ జిల్లా కమిటీ సభ్యులు మంజుశ్రీకి అభినందనలు తెలిపారు.

మత్స్యశాఖ డీడీగా శ్రీనివాసనాయక్

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ (డీడీ)గా కె.శ్రీనివాసనాయక్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఈయన తిరుపతి జిల్లా డీడీ ఫిషరీస్‌గా పని చేస్తుండగా, ఇక్కడికి బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణద్వివేది ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ డీడీగా పనిచేస్తున్న కె.శాంతి వైఎస్సార్ జిల్లాకు బదిలీ అయ్యారు.

హెచ్‌ఐవీ ల్యాబ్‌కు ఎన్‌ఏబీఎల్ సర్టిఫికెట్



ఎన్‌ఏబీఎల్ సర్టిఫికెట్‌ను చూపుతున్న ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్

అనంతపురం మెడికల్: ప్రభుత్వ వైద్య కళాశాలలోని మైక్రో బయాలజీ హెచ్‌ఐవీ ల్యాబ్‌కు నేషనల్ అక్రిడేషన్ బోర్డ్ ఆఫ్ ల్యాబొరేటరీస్ సర్టిఫికెట్ లభించింది. ఈ మేరకు సదరు ల్యాబొరేటరీస్ అర్హత సర్టిఫికెట్‌ను శుక్రవారం వైద్య కళాశాలకు పంపారు. వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు మాట్లాడుతూ హెచ్‌ఐవీ వ్యాధి నిర్ధారణ పరీక్షల్లో భాగంగా వైరల్‌లోడ్ ఎస్టిమేషన్ సెంటర్, సీడీ 4 కణాల పరీక్ష కేంద్రం, స్టేట్ రెఫరెన్స్ ల్యాబొరేటరీ, ఐసీటీసీ, పీపీటీసీ కేంద్రాల్లో నాణ్యత ప్రమాణాలు అద్భుతంగా పాటించినందుకు ఎన్‌ఏబీఎల్ అక్రిడిటేషన్ సర్టిఫికెట్ పొందినట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, వైద్యులు డాక్టర్ అనురాధ, డాక్టర్ నాగమణి, మైక్రోబయాలజీ వైద్యులు డాక్టర్ బసిరెడ్డి ప్రవీణ, డాక్టర్ హైమావతి, డాక్టర్ సరోజ, డాక్టర్ శైలజ, డాక్టర్ ఉమాదేవి, డాక్టర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు పాల్గొన్నారు.

ప్రజలకు చేరువగా సేవలందించండి

- జూమ్ కాన్ఫరెన్స్‌లో ఎస్పీ అన్బురాజన్



జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

అనంతపురం క్రైం: పోలీసులు ప్రజలకు చేరువగా సేవలందించాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశించారు. శుక్రవారం ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలోని తన చాంబర్ నుంచి రక్షక్, బ్లూకోట్స్, హైవే పెట్రోలింగ్ సిబ్బంది, సీఐ, ఎస్‌ఐలతో ఎస్పీ జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. వారికి పలు సూచనలు, సలహాలతో దిశానిర్దేశం చేశారు. నిత్యం గస్తీ తిరుగుతూ అనుమానాస్పద వ్యక్తులను గుర్తించాలన్నారు. నేరం జరిగిన ప్రదేశానికి తక్షణమే వెళ్లాలన్నారు. రెస్క్యూ చేయడం, రోడ్డు ప్రమాదాల ఘటనలపై వెంటనే స్పందించి, క్షతగాత్రులను సమీప ఆస్పత్రులకు తరలించాలన్నారు. ఇవన్నీ ప్రాథమిక బాధ్యతలుగా గుర్తెరగాలన్నారు. 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజల రక్షణను బాధ్యతగా భావించాలన్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణతో మొదలు శాంతిభద్రతల సమస్యలు, న్యూసెన్స్ ఘటనలు, అగ్ని ప్రమాద సంఘటనలు, డయల్ – 100 కాల్స్, ఈవ్ టీజింగ్, మార్నింగ్ వాకర్స్ రక్షణ బాధ్యతలు గట్టిగా తీసుకోవాలన్నారు. బ్యాంకులు, ఏటీఎం కేంద్రాలు, బంగారు షాపులు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, తదితర ప్రాంతాలలో తిరుగుతూ నిఘా ఉంచాలని ఎస్పీ సూచించారు.

నిందితుడి స్థానంలో వచ్చిన వ్యక్తికి రిమాండ్

అనంతపురం క్రైం: తాడిపత్రి రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో లైంగికదాడి కేసులో నిందితుడిగా ఉన్న ఐదుగురిలో ఓ వ్యక్తి స్థానంలో మరో వ్యక్తి వాయిదాకు హాజరయ్యాడు. 4వ ఏడీజే కోర్టు న్యాయమూర్తి అతన్ని గుర్తించి, టూటౌన్ పోలీసులకు అప్పగించారు. 2017లో ఓ మహిళపై జరిగిన అత్యాచారం కేసులో ఐదుగురు నిందితులు పట్టుబడ్డారు. ఈ కేసుకు సంబంధించి వాదోపవాదాలు జరుగుతున్నాయి. ఐదుగురిలో ఒకడైన పగడయ్య స్థానంలో హరీష్ అనే వ్యక్తి కోర్టుకు హాజరయ్యాడు. జఫేదారు పగడయ్య పేరును పిలిచిన సమయంలో హరీష్ న్యాయస్థానంలోకి వెళ్లి తానే పగడయ్యగా చెప్పుకోబోగా, అనుమానం వచ్చి అతని ఆధార్‌కార్డును చూపించాలని న్యాయమూర్తి ప్రశ్నించారు. నిందితుడి స్థానంలో వచ్చాడని గుర్తించి న్యాయమూర్తి అతన్ని టూటౌన్ పోలీసులకు అప్పగించారు.

సంక్షేమం, అభివృద్ధికి ప్రజలే సాక్ష్యం

- నగరంలో రూ.800 కోట్ల అభివృద్ధి
- మహిళల పరపతి పెంచిన సీఎం జగన్
- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



కోవూరునగర్‌లో మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



రుద్రంపేటలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న నేతలు

అనంతపురం కార్పొరేషన్: 'వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో రెండేళ్లు కోవిడ్ విపత్కర పరిస్థితులతో గడిచిపోయాయి. తదుపరి రెండున్నరేళ్లలో అనంతపురం నియోజకవర్గంలో రూ.800 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడం, వివిధ పథకాల ద్వారా రూ.వేల కోట్ల సంక్షేమ లబ్ధిని అందించడం జరిగింది. ఇందుకు ప్రజలే సాక్ష్యం' అని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. శుక్రవారం నగరంలోని 27 సచివాలయం రహమత్‌నగర్, 44వ సచివాలయం హమాలీ కాలనీ, 55వ సచివాలయం కోవూర్‌నగర్, 24వ సచివాయం కమలానగర్‌లో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం జరిగింది. కోవూర్‌నగర్, హమాలీ కాలనీల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సంక్షేమ, అభివృద్ధి బోర్డులను ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేశారు. ఎమ్మెల్యే అనంత మాట్లాడుతూ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కనీవినీ ఎరుగని రీతిలో సంక్షేమం, అభివృద్ధి చేసి చూపిందన్నారు. గత టీడీపీ హయాంలో ఎంపీ, ఎమ్మెల్యే, మేయర్ విభేదాల కారణంగా నగర అభివృద్ధిని విస్మరించారని విమర్శించారు. టీడీపీకి అనుకూలంగా ఉన్న వారికి మాత్రమే అప్పట్లో ప్రభుత్వ పథకాలు అందేవన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక సచివాలయ–వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టి ప్రభుత్వ సేవలను ప్రజల ముంగిటకు తీసుకెళ్లిందన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా ఎటువంటి సిఫార్సులు లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు మంజూరు చేసిందన్నారు. పాలనలో తేడాలు గమనించి మంచి చేసే ప్రభుత్వానికి అండగా నిలవాలని సూచించారు.

మహిళల పరపతి పెరిగింది

చంద్రబాబు హయాంలో రుణాలు మాఫీ చేస్తానని మాట తప్పడంతో డ్వాక్రా సంఘాలు డీఫాల్టర్ జాబితాలోకి వెళ్లిపోయాయని ఎమ్మెల్యే అనంత పేర్కొన్నారు. పాదయాత్రలో మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక మూడు విడతల్లో రూ.19 వేల కోట్ల డ్వాక్రా రుణాలు మాఫీ చేశారని తెలిపారు. నాలుగో విడత సొమ్ము ఫిబ్రవరిలో చెల్లిస్తారన్నారు. పేదలను ధనికులుగా చేయాలన్న లక్ష్యంతో సీఎం వివిధ పథకాలు అమలు చేస్తుంటే ఓర్వలేని ప్రతిపక్ష తెలుగుదేశం ఎల్లో మీడియాను అడ్డు పెట్టుకుని రాష్ట్రం దివాళా తీసిందని దుష్ప్రచారం చేస్తోందని దుయ్యబట్టారు. మేయర్ వసీం మాట్లాడుతూ గత 40 ఏళ్ల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా నగరంలో పెద్ద ఎత్తున అభివృద్ధి జరిగిందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య, కార్పొరేటర్లు అనిల్‌కుమార్‌రెడ్డి, కమల్‌భూషణ్, ఇషాక్ అహ్మద్, మీనాక్షమ్మ, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు చింతా సోమశేఖర్‌రెడ్డి, క్లస్టర్ అధ్యక్షులు రమణారెడ్డి, ఓబిరెడ్డి, తిరుపీధుల జగదీష్, మధు, జేసీఎస్ కన్వీనర్లు చింతకుంట మధు, రామకృష్ణారెడ్డి, లక్ష్మణ్ణ, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొర్రపాడు హుస్సేన్ పీరా, నాయకులు మహానందరెడ్డి, నాగార్జున రెడ్డి, ఖాజా, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో రుద్రంపేట

అనంతపురం రూరల్: అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవడంతో రుద్రంపేట పంచాయతీ అభివృద్ధి పథంలో పయనిస్తోందని వైఎస్సార్ సీపీ జేసీఎస్ కన్వీనర్ ఆలమూరు శ్రీనివాసరెడ్డి, రూరల్ మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ హుస్సేన్ అన్నారు. శుక్రవారం రుద్రంపేట పంచాయతీలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించే ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఆలమూరు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ జగనన్న పాలనలోనే బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరుగుతోందన్నారు. అన్ని వర్గాలకూ అండగా ఉన్న వైఎస్సార్‌సీపీకి 2024 ఎన్నికల్లో మద్దతుగా నిలవాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు మహబూబ్‌బీ, నారాయణమ్మ, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాదిక్ వలి, పార్టీ మహిళా విభాగం నగర అధ్యక్షురాలు కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: ముఖ్యమంత్రి జగన్‌తోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతోందని ఎంపీపీ హేమలత తెలిపారు. శుక్రవారం మండలంలోని ముట్టాలలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచులు తిరుపాలమ్మ, నాగరత్నమ్మ, గొరిదిండ్ల ఎంపీటీసీ చిట్టెమ్మ, మాజీ సర్పంచ్ సునీల, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు బాలపోతన్న, కన్వీనర్ నరసింహులు, యూత్ కన్వీనర్ కొండారెడ్డి పాల్గొన్నారు.



ముట్టాలలో వైఎస్సార్‌సీపీ జెండా ఆష్కరణ

'బస్సుయాత్ర' జయప్రదం చేయండి



సామాజిక బస్సుయాత్ర జరిగే స్థలం వద్ద పోలీసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

రాప్తాడు: నియోజకవర్గ కేంద్రమైన రాప్తాడులో ఈ నెల 4వ తేదీ జరిగే సామాజిక సాధికార బస్సు యాత్రను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. రాప్తాడులో జరిగే సామాజిక బస్సుయాత్ర స్థలాన్ని స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాప్తాడులో జరిగే సామాజిక బస్సుయాత్రకు నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు వేలాదిగా తరలివచ్చి యాత్రను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బోయ రామాంజినేయులు, బీసీ సెల్ నాయకులు చిట్రా వెంకటేష్, పసుపుల ఆది, మండల ఎన్నికల ఇన్‌చార్జి చిట్రెడ్డి సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, అగ్రి బోర్డు చైర్మన్ గొర్ల కేశవరెడ్డి, మేకలు, గొర్రెల సంఘం జిల్లా అధ్యక్షుడు పసుపుల నరసింహగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గౌరవ వేతనం పెంపుపై హర్షం

అనంతపురం: జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్లకు రాష్ట్ర ప్రభుత్వం గౌరవ వేతనం పెంచింది. రూ.25వేల నుంచి రూ.30 వేలకు వేతనాన్ని పెంచారు. గౌరవ వేతనం పెంపుపై జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమామోహన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



సాకే నిఖిత

రాప్తాడు: మండలంలోని ధర్మవరం పంగల్ రోడ్డులోని ఆదర్శ పాఠశాల విద్యార్థిని సాకే నిఖిత స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచి జాతీయస్థాయి విలువిద్య పోటీలకు ఎంపికైందని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ పద్మజాదేవి, పీఈటీ బాలగొండ మల్లికార్జున తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 17, 18వ తేదీల్లో గుజరాత్‌లో జరిగే 67వ జాతీయ స్కూల్ గేమ్స్‌లో నిఖిత పాల్గొంటుందన్నారు. ఆర్డీటీ సహకారంతో పీఈటీ సులోచన, కోచ్ లక్ష్మీ పర్యవేక్షణలో మెలకువలు నేర్చుకుందని పేర్కొన్నారు.

అన్నపూర్ణేశ్వరి సేవతోనే మానవ జన్మ సార్థకం



మాలధారులకు భిక్ష వడ్డిస్తున్న ఆత్మవిదానంద

అనంతపురం కల్చరల్: అన్నపూర్ణేశ్వరి సేవతోనే మానవ జన్మకు సార్థకత చేకూరుతుందని చిన్మయామిషన్ జిల్లా ఇన్‌చార్జ్ స్వామి ఆత్మవిదానంద సరస్వతి అన్నారు. శుక్రవారం స్థానిక హరిహరదేవాలయంలో మాలధారులకు మండల రోజుల పాటు సాయిట్రస్టు విజయ్‌కుమార్ నేతృత్వంలో సాగే ఉచిత భిక్ష కార్యక్రమంలో ఆయనతో పాటూ ఆధ్యాత్మికవేత్త మనూరు నాగరాజు ముఖ్య అతిథులుగా విచ్చేసి మాట్లాడారు. మాలధారణ చేసిన వారు నియమ నిష్టలు కొనసాగించాలని సూచించారు. నిర్వాహకులు సాయి మాట్లాడుతూ 41 రోజుల పాటు నిత్య భిక్ష కొనసాగుతుందని, అయ్యప్ప మాలధారులే కాకుండా భవాని, శివ, గోవింద మాలధారులు కూడా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నంద్యాల రఘునాథ్, ఆలయ కార్యదర్శి రవి, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ ఆలోచనలు ఉండాలి



మాట్లాడుతున్న మురళీధర్

అనంతపురం ఎడ్యుకేషన్: సమాజంలో నెలకొన్న మూఢాచారాలను వ్యతిరేకించాలంటే విద్యార్థి దశ నుంచే శాస్త్రీయ ఆలోచనలు కల్గి ఉండాలని జన విజ్ఞాన వేదిక (జేవీవీ) రాష్ట్ర మాజీ కార్యదర్శి మురళీధర్ తెలిపారు. జేవీవీ నగర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు శాస్త్రీయ అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ రమణ కుమార్ అధ్యక్షత వహించిన ఈ సదస్సులో మురళీధర్ మాట్లాడుతూ సమాజ పురోగతికి అడ్డంకిగా ఉన్న మూఢాచారాలను శాస్త్రీయ దక్పథం ద్వారా మాత్రమే ఎదుర్కోగలమన్నారు. జేవీవీ నగర అధ్యక్షుడు రామిరెడ్డి, సహాయ కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా పక్కాగా ఉండాలి

ఆత్మకూరు: ఓటరు జాబితా పక్కాగా ఉండాలని, ఓటు జాబితాలో ఎలాంటి ఫిర్యాదులు ఉన్నా వాటిని సరి చేసేలా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ షర్మిల తెలియజేశారు. శుక్రవారం మండల కేంద్రంలో తహసీల్దార్ ఓటర్ల జాబితాపై సర్వే నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఓటు జాబితా పరిశీలించారు. చనిపోయిన వారి ఓటు వివరాలు తెలుసుకొని వాటిని తొలగించాలని వీఆర్వోలకు సూచించారు.

బాలల సైన్సు కాంగ్రెస్‌లో 'అనంత' విద్యార్థుల సత్తా



ఎంపికైన విద్యార్థినులకు మెమొంటో, ప్రశంసాపత్రం అందిస్తున్న అధికారులు

అనంతపురం ఎడ్యుకేషన్: రాష్ట్ర స్థాయి జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌లో సత్తాచాటిన 'అనంత' విద్యార్థుల ప్రాజెక్ట్ జాతీయ స్థాయికి ఎంపికయ్యింది. జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ రాష్ట్ర స్థాయి పోటీలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి ఆధ్వర్యంలో నవంబరు 29, 30 తేదీల్లో విజయవాడ కేఎల్ విశ్వవిద్యాలయంలో జరిగాయి. అనంతపురం జిల్లా నుంచి 7 ప్రాజెక్టులు ప్రాతినిధ్యం వహించాయి. మాంటిస్సోరి ఎలైట్ స్కూల్ విద్యార్థుల ప్రాజెక్ట్ జాతీయ స్థాయికి ఎంపికైంది. ఎన్‌సీఎస్సీ జిల్లా కోఆర్డినేటర్ ఆనంద భాస్కర్‌రెడ్డి, అకడమిక్ కోఆర్డినేటర్ మేడా ప్రసాద్ ఆధ్వర్యంలో 'పక్షులపై పట్టణీకరణ ప్రభావం' అనే అంశంపై మాంటిస్సోరి ఎలైట్ స్కూల్ విద్యార్థినులు అన్విత, స్పందన ప్రదర్శించిన ప్రాజెక్టు అందరి మన్ననలు పొంది జాతీయ స్థాయికి ఎంపికైంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి మెంబర్ సెక్రటరీ అపర్ణ, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ ప్రతాపరెడ్డి, సీకే దాస్ అకాడమి ట్రస్టీ ఉమామోహన్ తదితరులు విద్యార్థినులను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం సర్టిఫికెట్లు అందజేశారు. జిల్లా విద్యాశాఖాధికారి నాగరాజు విద్యార్థినులను అభినందించారు.

ప్రతిధ్వనించిన శరణు ఘోష

అనంతపురం కల్చరల్: 'స్వామి శరణం.. అయ్యప్ప శరణం.. స్వామియే అయ్యప్ప' అంటూ భక్తుల శరణు ఘోషతో పాతూరు వీధులు ప్రతిధ్వనించాయి. శుక్రవారం అయ్యప్ప పడిపూజోత్సవం కనుల పండువగా సాగింది. తిప్పలూరు కొండారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన పడిపూజలో వందల సంఖ్యలో అయ్యప్ప మాలధారులు తరలి వచ్చి సామూహిక భజన నిర్వహించారు. 18 మెట్లను సర్వాంగ సుందరంగా అలంకరించి పూజలు చేశారు. అంబకపల్లి నుంచి ప్రత్యేకంగా రప్పించిన భజన బృందాలు ఆలపించిన అయ్యప్ప భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి. అనంతరం భిక్ష కార్యక్రమం జరిగింది. జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ ఆచార్య శశిధర్, డాక్టర్ మమతను మాలధారులు సత్కరించారు. గురుస్వాములు ప్రసాద్‌స్వామి, శ్రీకాంత్, శ్రీనివాసరెడ్డి పడిపూజల్లో పాల్గొన్నారు.



అయ్యప్పల సామూహిక భజన

నేటి నుంచి విగ్రహ పునః ప్రతిష్ట

అనంతపురం కల్చరల్: నగరంలోని చెరువుకట్టపై గల అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం నుంచి మూడు రోజుల పాటు విగ్రహ పునఃప్రతిష్ట కార్యక్రమాలు జరగనున్నాయి. అలాగే మండల పూజలు ప్రారంభం కానున్నాయి. శుక్రవారం అయ్యప్పస్వామి ఆలయంలో జరిగిన సమావేశంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మణికంఠ గౌతం వివరాలు వెల్లడించారు. కేరళ రాష్ట్రం శబరిమల సన్నిధానం నుంచి బ్రహ్మశ్రీ రాజీవ్ తంత్రి చేతుల మీదుగా శనివారం పునఃప్రతిష్ట కార్యక్రమాలు, ఉత్సవ పూజలు జరుగుతాయన్నారు. ఉత్సవాలు జరిగినన్నిరోజులు సాయంత్రం భిక్ష కూడా ఉంటుందని తెలిపారు. సోమవారం విగ్రహ ప్రతిష్ట శాస్త్రోక్తంగా సాగుతుందని, మాలధారులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బోనా నాగలింగారెడ్డి, గజేంద్రమోహన్, నాగానందం, రాము, కేశవ తదితరులు పాల్గొన్నారు.

ఠంచనుగా 'పింఛన్'



మదిగుబ్బ వద్ద పొలంలో పింఛన్ అందిస్తున్న వలంటీర్ శివప్రసాద్

ఆత్మకూరు: రాప్తాడు నియోజకవర్గంలో శుక్రవారం తెల్లవారుజాము నుంచే వలంటీర్లు పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. లబ్ధిదారులు ఉన్న ప్రాంతానికే వెళ్లి పింఛన్ డబ్బులను అందించారు. దీంతో పింఛన్‌దారులు హర్షం వ్యక్తం చేశారు. ఠంచనుగా ఒకటోతేదీనే పింఛన్ ఇవ్వడాన్ని గతంలో ఎప్పుడూ చూడలేదన్నారు.

ఉత్తమ రక్తనిధి కేంద్రంగా జీజీహెచ్



రక్తనిధి బృందం, స్టాఫ్‌నర్సులను అభినందిస్తున్న సూపరింటెండెంట్

అనంతపురం మెడికల్: జిల్లాలో రక్తనిధి కేంద్రంగా సర్వజనాస్పత్రిలోని రక్తనిధి కేంద్రం ఎంపికైంది. ఈ మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రకటించింది. ఈ సందర్భంగా రక్తనిధి కేంద్రం ఇన్‌చార్జ్ ప్రొఫెసర్ డాక్టర్ శివశంకర్ నాయక్, మెడికల్ ఆఫీసర్ లక్ష్మి, గ్రేడ్- 1 నర్సింగ్ సూపరింటెండెంట్ మంజు, గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్ రజిని, సిబ్బంది రమణారెడ్డిలను జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు శుక్రవారం అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

అనంతపురం క్రైం: నగరంలోని సుభాష్‌రోడ్డులో నందిని హోటల్ వద్ద కళ్యాణదుర్గం రోడ్డుకు చెందిన వెంకటరాముడు రోడ్డు దాటుతుండగా అతి వేగంతో వచ్చిన ఆటో ఢీకొంది. కాళ్లు, తలకు తీవ్ర గాయమై కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న అతడిని స్థానికులు 108 వాహనంలో సర్వజనాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అతడిని కుటుంబ సభ్యులు మరొక ఆస్పత్రిలో చేర్పించారు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి, ప్రమాదానికి కారణమైన ఆటోను స్వాధీనం చేసుకున్నారు.

7 నుంచి ఏబీవీపీ మహాసభలు

అనంతపురం: ఏబీవీపీ 69వ జాతీయ మహాసభలు ఈ నెల ఏడు నుంచి పదో తేదీ వరకు ఢిల్లీలు జరగనున్నాయి. మహాసభల పోస్టర్లను శుక్రవారం ఎస్కేయూనివర్సిటీ ప్రధాన ద్వారం వద్ద ఏబీవీపీ ఎస్కేయూ అధ్యక్షుడు దివాకర్ నాయక్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు.

జగనన్నకు మరోసారి పట్టం కడదాం

- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



పుల్లలరేవులో వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడు: ప్రజా రంజక పాలన అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి పట్టం కట్టాలని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని పుల్లలరేవులో గడప గడపకూ మన ప్రభుత్వం, జగనన్న ప్రజా సంక్షేమ సదస్సు జరిగింది. అలాగే మరూరులో శుక్రవారం సాయంత్రం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

చంద్రబాబు హయాంలో అన్ని వర్గాలకు అన్యాయం

ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా చంద్రబాబు అన్ని వర్గాలను మోసం చేశారని విమర్శించారు. చంద్రబాబు పాలనలో రూ. 3 లక్షల కోట్లు అప్పులు చేసి రాష్ట్రాన్ని దివాళా తీయించాడన్నారు. చంద్రబాబు రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టివేశాడని కాగ్ కూడా చెప్పడం జరిగిందన్నారు. చంద్రబాబు లక్ష కోట్ల రూపాయలను దోపిడీ చేశారని 2019 ఎన్నికల్లో గుంటూరు సభలో స్వయంగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చెప్పారని గుర్తు చేశారు. చంద్రబాబు దోపిడీ చేశాడు కాబట్టే జైలుకు వెళ్లారన్నారు. కేవలం ఆయనకు జబ్బులు ఉన్నాయనే కోర్టు బెయిల్ మంజూరు చేసిందని, తప్పు చేయలేదని ఎక్కడా చెప్పలేదన్నారు. యువగళం పేరుతో నారా లోకేష్ చేసిన పాదయాత్ర వల్లనే మేఘాలు వెనక్కి వెళ్లిపోవడంతో వర్షాలు ఈ ఏడాది తగ్గుముఖం పట్టాయన్నారు. నాలుగేళ్లలో వర్షాలు అధికంగా వచ్చాయన్నారు.

ఇచ్చిన మాట నిలుపుకున్నాం

పరిటాల సునీత పేరూరు డ్యాంకు నీళ్లు తెప్పిస్తామని చెప్పి నీళ్లు తేలేక విఫలమయ్యారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పేరూరు డ్యాంను మూడుసార్లు నింపిన విషయాన్ని గుర్తు చేశారు. నాలుగోసారి భగవంతుడే అధిక వర్షాలు కురిపించడంతో పేరూరు డ్యాంకు పారిందన్నారు. ఇలా ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలను అందిస్తూ మహాత్మాగాంధీ కన్న కలలను సాకారం చేస్తున్న ఘనత మన ముఖ్యమంత్రి జగనన్నకే దక్కిందన్నారు. ఇలాంటి సీఎం మనకు ఉండటం రాష్ట్ర ప్రజలు చేసుకున్న అదృష్టమన్నారు.

ప్రభుత్వ భవనాలు ప్రారంభించిన ఎమ్మెల్యే

హంపాపురంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, మరూరు గ్రామంలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలను ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. జగనన్న తీసుకొచ్చిన సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ వైపు దేశం మొత్తం చూస్తోందన్నారు. తమిళనాడు రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టు కింద 600 సచివాలయాలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఇంటి ముంగిటకే సంక్షేమ ఫలాలను అందిస్తున్న సీఎం జగన్‌ను మరోసారి ప్రజలందరూ పట్టం కట్టాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ హార్టికల్చర్ వర్సిటీ బోర్డు సభ్యుడు గద్దె ఆగ్రోస్ కేశవరెడ్డి, ఎంపీడీఓ సాల్మన్, తహసీల్దార్ మునివేలు, మరూరు సొసైటీ అధ్యక్షుడు మాచిరెడ్డి కొండారెడ్డి, ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మీ, జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి, వైస్ ఎంపీపీ బోయ రామాంజినేయులు, మేకలు, గొర్రెలు సంఘం జిల్లా అధ్యక్షుడు పసుపుల నరసింహ గౌడ్, బీసీ సెల్ నాయకులు పసుపుల ఆది, చిట్రా వెంకటేష్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ నారాయణస్వామి, అగ్రి బోర్డు చైర్మన్ కేశవరెడ్డి, సర్పంచులు గౌరవ లక్ష్మీదేవి, బొమ్మిళ్ల ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

రాప్తాడు: మండలంలోని పుల్లలరేవుకు చెందిన టీడీపీ నాయకులు పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. శుక్రవారం పుల్లలరేవులో జగనన్న ప్రజా సంక్షేమ సదస్సు కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీ నాయకులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారందరికీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీలో చేరిన వారిలో ఉప్పర రామాంజి, ఉప్పర నరసింహులు, నాగరాజు, ఎస్.చిన్న గంపన్న, పూజారి రామాంజినేయులు, పూజారి వెంకటరాముడు, పూజారి యర్రప్ప, పూజారి చిన్న పెద్దన్న, పూజారి పెద్దన్న, ఎస్.ఓబులేష్, ముత్యాలు, ఎన్. పెద్దన్న, బిల్లే రామాంజినేయులు, బిల్లే ముత్యాలు, ఎట్టి సూరి, కంశల చంద్రశేఖర్, కాకల చిన్న కేశవయ్య తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బోయ రామాంజినేయులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, మండల ఎన్నికల ఇన్‌చార్జి చిట్రెడ్డి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అడిగిన ప్రతి కూలీకీ ఉపాధి

రాప్తాడు: ఉపాధి హామీ పథకం కింద అడిగిన వారందరికీ పనులు కల్పించాలని వాటర్‌షెడ్ అడిషినల్ పీడీ, ప్రొసైడింగ్ అధికారి సుధాకర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాప్తాడులో స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో వాటర్‌షెడ్ అడిషినల్ పీడీ సుధాకర్‌రెడ్డి, డ్వామా జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ రమణారెడ్డి, ఏపీడీ అనూరాధ ఆధ్వర్యంలో సామాజిక తనిఖీపై ప్రజావేదిక నిర్వహించారు. 1-04-22 నుంచి 31-03-23 వరకు మండల వ్యాప్తంగా 1513 పనులకు గాను రూ. 11,10,27,714 కోట్ల పనులు చేశారు. అందులో రూ. 42 వేలు రికవరీకి ఆదేశించారు. ఉపాధి కూలీలు పనులు అడిగిన 15 రోజుల్లోపు పనులు కల్పించకపోతే వారికి నిరుద్యోగ భృతి ఇవ్వాల్సి ఉందన్నారు. ప్రతి గ్రామంలోనూ కనీసం 100 రోజులు తక్కువ లేకుండా పనులు కేటాయించాలని పేర్కొన్నారు. ఉపాధి పనులపై నిర్లక్ష్యం చూపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాల్మన్, ఈఓఆర్డీ నరసింహరెడ్డి, ఏపీఓలు ఓబన్న, సావిత్రి, ఎస్సార్పీ వెంకటేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రేపు బ్రాహ్మణ కార్తీక దామోదర హోమం

అనంతపురం కల్చరల్: జిల్లా బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక దామోదర హోమం, కార్తీక వనభోజనంతో పాటూ బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనం జరగనుంది. ఇందుకు సంబంధించిన వివరాలను ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆలూరు లక్ష్మీనరసింహశాస్త్రి శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన కార్యక్రమంలో వెల్లడించారు. ఆదివారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు ఆదర్శనగర్‌లోని గంగపుత్ర కమ్యూనిటీ హాలులో జరిగే కార్యక్రమానికి ఏపీ రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పేరి కామేశ్వరరావుతో పాటు వివిధ జిల్లాల నుంచి బ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు ఆత్మీయ అతిథులుగా విచ్చేస్తున్నారని తెలిపారు. బ్రాహ్మణులందరూ కార్తీక వనభోజనాలలో పాల్గొనాలని కోరారు.

సెల్‌ఫోన్ అపహరణపై ఫిర్యాదు

అనంతపురం క్రైం: ప్రభుత్వ వైద్య కళాశాల హాస్టల్‌లోకి గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి చొరబడి విద్యార్థిని సెల్‌ఫోన్‌ను అపహరించుకుపోయాడు. మెడికల్ కాలేజీ విద్యార్థులు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రిన్సిపాల్ మాణిక్యరావు కూడా ఎస్పీ అన్బురాజన్‌ను కలిసి ఫిర్యాదు చేశారు.

ఫార్మసిస్టుల పాత్ర కీలకం



సర్వజనాస్పత్రి ముందు మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యులు, విద్యార్థులు

అనంతపురం: ఆరోగ్య పరిరక్షణలో ఫార్మసిస్టుల పాత్ర ఎంతో కీలకమైనదని జేఎన్‌టీయూఏ- ఓటీపీఆర్ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.దుర్గాప్రసాద్ అన్నారు. శుక్రవారం ఓటీపీఆర్ఐలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం నిర్వహించారు. డైరెక్టర్ ప్రొఫెసర్ బి.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఎయిడ్స్ రోగుల పట్ల వివక్ష చూపకూడదన్నారు. ఎయిడ్స్‌బారిన పడకుండా జీవన శైలిలో తీసుకోవాల్సిన మార్పుల గురించి వివరించారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపీనాథ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కేతు శైలజ తదితరులు పాల్గొన్నారు.

- శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ప్రోగ్రాం ఆఫీసర్ పి. సత్య సౌమ్య ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత 42 సంవత్సరాలలో ప్రపంచవ్యాప్తంగా 8.60 కోట్ల మంది ఎయిడ్స్ బారిన పడ్డారని ఆవేదన చెందారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ డి.మురళీధర్‌రావు, ఎస్కేయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సోమశేఖర్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ధనుంజయ, డాక్టర్ చాగంటి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

అనంతపురం మెడికల్: ప్రపంచ ఎయిడ్స్ దినాన్ని పురస్కరించుకుని డెర్మటాలజీ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు జెండా ఊపి ప్రారంభించిన ర్యాలీ జీజీహెచ్ నుంచి తెలుగు తల్లి విగ్రహం వరకు సాగింది. అనంతరం వైద్య కళాశాలలో ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.మాణిక్యరావు హెచ్ఐవీ నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రధానంగా యువత ముందుచూపుతో వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ పద్మావతి, డెర్మటాలజీ విభాగాధిపతి డాక్టర్ కిషోర్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ లెక్కల శ్రీదేవి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నీలిమ, ఏఆర్‌టీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ మనోరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: ఎయిడ్స్ రోగుల పట్ల వివక్ష చూపకూడదని డాక్టర్ భార్గవి తెలిపారు. శుక్రవారం ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఆత్మకూరులో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎయిడ్స్ వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ ప్రీతి, ఏఎన్ఎం అలివేలయ్య, ప్రిన్సిపాల్ శంకరయ్య, పీహెచ్ఎన్ తులసమ్మ, సీహెచ్ఓ షమీన్‌తార తదితరులు పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న ఎయిడ్స్ మహమ్మారిని పారదోలుదామని ఎన్ఎస్ గేట్ పీహెచ్‌సీ వైద్యులు రవీనాయక్ తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా స్థానిక పీహెచ్‌సీ సిబ్బందితో కలిసి శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఆస్పత్రి సిబ్బంది గోవిందమ్మ, పద్మావతి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.